# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 01 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఆప్‌కు 8 మంది ఎమ్మెల్యేల రాజీనామా

- వారంతా టికెట్ దక్కని వారే..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు వారం రోజులు కూడా లేని సమయంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్ తగిలింది. సొంత పార్టీ ఎమ్మెల్యేలు 8 మంది శుక్రవారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే వీరంతా ఈ ఎన్నికల్లో టికెట్లు లభించని వారే. పాలమ్ ఎమ్మెల్యే భవన్ గౌర్ ఈ మేరకు పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్‌కు లేఖ రాస్తూ పార్టీ పట్ల తాను విశ్వాసాన్ని కోల్పోయానని, అందుకే రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తూర్బా నగర్ ఎమ్మెల్యే మదన్ లాల్, మెహ్రౌలీ ఎమ్మెల్యే నరేశ్ యాదవ్ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

# నేను కొడితే మామూలుగా ఉండదు..!



- గట్టిగా కొట్టడమే నాకు అలవాటు
- మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా
- రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ నిలిచిపోయాయి
- ఒక్క పథకం సరిగ్గా అమలు కావడం లేదు
- రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారు
- ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- జహీరాబాద్ బీఆర్ఎస్ నేతలతో భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"నేను కొన్నాండ్లుగా గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా.. మీ అందరికీ తెలుసు.. నేను కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు కదా.. ఫిబ్రవరి నెల చివరిలో భారీ బహిరంగసభ పెడదాం రావాలి. తెలంగాణ శక్తి చూపిద్దాం.." అని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తాను కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం తన అలవాటన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానన్నారు. తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారన్నారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కైలాస ఆటలో పైకి పోయిన తర్వాత పెద్ద పాము మింగినట్టు రాష్ట్ర పరిస్థితి తయారయిందని అన్నారు. కరోనా సమయంలో కూడా తాను రైతు బంధు ఇచ్చానని, రైతుల కోసం ఎన్నో మంచి పథకాలు తీసుకొచ్చానని... ఇప్పుడు అంతా గంగలో కలిసిపోయిందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ కోసం పుట్టిందని... రాజకీయాల కోసం పుట్టింది కాదని అన్నారు.

కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

# దమ్ముంటే అసెంబ్లీకి రా..

- లెక్కలు చెబుతా..
- బలంగా కొట్టడం కాదు కేసీఆర్ ..
- ముందు సరిగ్గా నిలబడటం నేర్చుకో
- ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాలేదు
- జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్న ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తానని మాట తప్పారు.
- కేసీఆర్ కాలం చెల్లిపోయిన వెయ్యి రూపాయల నోటు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, రంగారెడ్డి బ్యూరో**

'రాష్ట్రంలో కేసీఆర్ చెల్లని వెయ్యి రూపాయల నోటు.. వెయ్యి రూపాయల నోటు కోసం వెతికితే తీసుకెళ్లి జైల్లో పెడతారు. డిసెంబర్‌లో అధికారం కోల్పోయి.. జూన్‌లో డిపాజిట్ కోల్పోయిన కేసీఆర్.. మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని గప్పాలు కొట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొని లెక్కలు అని చెబుతా విను' అంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూర్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సీఎంతోపాటు ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. హైదరాబాద్ సంస్థానం నుంచి ఏర్పడిన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి, హరగోపాల్ లాంటి మేధావులను అందించిన మొగిలిగిద్ద పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో సంభాషించారు. అనంతరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

"తెలంగాణ ధనిక రాష్ట్రమంటూ కేసీఆర్ అబద్ధాలు చెప్పారు. వచ్చి చూస్తే ఖాళీ తప్ప ఏమీ లేదు. అయినా అధైర్యపడకుండా కేసీఆర్ ఎగొట్టిన రైతుభరోసా ఇస్తున్నాం. ఏడాదికి రూ.12000 రైతుభరోసా ఇవ్వాలని జనవరి 26న ప్రారంభించాం. మార్చి 31వ తేదీలోపు మీ అకౌంట్లలోకి వేసే పూచీ నాది. రైతుభరోసా ఎగ్గొడతామని కేసీఆర్ అంటున్నారు. నేను మీలాగా ఎగ్గొట్టే రకం కాదు. దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అంటూ ఎగ్గొట్టారు. పదేళ్లు పరిపాలన చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు పోయాయ్. అబద్ధాలు చెప్తే పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు." అంటూ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

"14 నెలల నుంచి ఫామ్ హౌస్‌లో గంభీరంగా చూస్తూ ఉన్నారంట. ఏం చూస్తున్నారు.. కేటీఆర్, హరీష్‌రావులను ఊరి మీదకు వదిలావ్.పాలమూరు ప్రాజెక్టు కడతానని చెప్పి మాట తప్పావ్. జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్న ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తానని మాట తప్పారు. తెలంగాణ ప్రజలు ఆయన కోసం ఎదురుచూస్తున్నారంట.. కేసీఆర్ గారూ.. తెలంగాణ ప్రజలు ఎవరూ మీ కోసం ఎదురు చూడటం లేదు. బాధపడటం లేదు. రైతులకు భరోసా, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫ్రీ సిలిండర్లు ఇస్తున్నాం. తెలంగాణ ప్రజలు ఎవరూ బాధపడటం లేదు. " అని కౌంటర్ ఇచ్చారు.

" ఆయన కొడితే బలంగా కొడతాడంట. కర్ర లేకుండా సరిగ్గా నిలబడేది నేర్చుకోవాలి ముందు. నువ్వు తూలుతున్నావా.. తూగుతున్నావా.. నిలబడగలిగే పరిస్థితుల్లో ఉన్నావా అనేది చూస్కోవాలి. సోషల్ మీడియాలో నాకు, కేసీఆర్‌కు పోటీపెడితే.. ఆయనకు లైకులు ఎక్కువచ్చాయంట. బాలీవుడ్‌లో కూడా సల్మాన్ ఖాన్‌కు, రాఖీసావంత్‌కు పోటీపెడితే.. రాఖీసావంత్‌కే ఎక్కువ లైకులు వచ్చాయి. అంతమాత్రాన రాఖీసావంత్, సల్మాన్ ఖాన్ కంటే గొప్ప అవుతారా? పదేళ్ల పాలనను జనం తిరస్కరిస్తే, ఫామ్‌హౌస్‌లో ఉంటూ సోషల్ మీడియా లైకులు గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలి. ఏబీసీడీ వర్గీకరణపై మాట్లాడదాం.. నువ్వా, మేమా తేల్చుకుందాం.. కేసీఆర్ కాలం చెల్లిపోయిన వెయ్యి రూపాయల నోటు. ఆ నోటుకు ఇప్పుడు విలువ లేదు. ఆ నోటు ఉంటే జైల్లో వేస్తారు. తెలంగాణ సమాజంలో కేసీఆర్ గురించి అడిగేవారు లేరు" అంటూ కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి కౌంటరిచ్చారు.

విద్యపై పెట్టేది ఖర్చు కాదని.. భవిష్యత్ తరాలకు పెట్టుబడి అని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం

మిగితా 2వ పేజీలో

# త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్

- 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం
- భారత ఏఐ మిషన్‌ను ప్రారంభించాం
- ఎన్డీయే ప్రభుత్వం మూడు రెట్ల వేగంతో పని చేస్తోంది.
- 25 కోట్ల మందిని దారిద్ర్య రేఖ దిగువ నుంచి పైకి తీసుకొచ్చాం.
- సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం
- రూ. 70 వేల కోట్లతో గ్రామీణ రహదారుల అభివృద్ధి.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యమని ఆమె చెప్పారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. జనవరి 31న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశిస్తూ పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులు అర్పించాయి. ప్రధానిగా ఆయన చేసిన సేవలను పార్లమెంట్ సాక్షిగా కొనియాడారు. మరోవైపు మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలో మృతులకు సైతం ఉభయ సభల సభ్యులు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. "బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మా ప్రభుత్వం మూడో టెర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి దూసుకెళ్తోంది. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. అందుకే వేగంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నాం. 3 కోట్ల మంది పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మిస్తున్నాం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్ల మందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భారతీయులు అంతరిక్షంలో అడుగుపెట్టే రోజు దగ్గర్లోనే ఉంది. భారత మహిళలు ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తున్నారు. విద్యా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్ హౌస్‌గా మారుస్తాం. ఇండియా ఏఐ మిషన్‌ను ప్రారంభించాం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించాం. స్పోర్ట్స్ నుంచి స్పేస్ వరకూ భారత్ దూసుకుపోతోంది. ఎంఎస్ఎమ్ఈల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ తీసుకొచ్చాం. ఇ-గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పౌర విమానయాన రంగం అభివృద్ధి చెందుతోంది.

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. పోలవరం నిర్మాణానికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సైబర్ సెక్యూరిటీలో సమర్థత పెంచుతున్నాం. దేశ ఆర్థిక, సామాజిక, జాతీయ భద్రతకు పని చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ క్రైమ్, డీప్ ఫేక్ పెనుముప్పుగా మారాయి. దళితులు, వెనకబడిన వర్గాలకు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నాం. ఆదివాసీ ప్రాంతాల్లో 30 వైద్య కళాశాలలు ప్రారంభించాం. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు అందుబాటులోకి తెచ్చాం. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పెరుగుతున్న క్యాన్సర్ కేసుల దృష్ట్యా ఔషధాలపై కస్టమ్స్ సుంకం తగ్గించామని" చెప్పారు.

## ప్రజల్లో బడ్జెట్ కొత్త విశ్వాసం నింపుతుంది



- ప్రధాని మోడీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని భావిస్తున్నట్టు ప్రధాని మోడీ అన్నారు.మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారని.. పార్లమెంట్‌లో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలని ఆకాంక్షించారు. భారత శక్తి సామర్థ్యాలు మనకు విశేష గుర్తింపునిస్తాయన్నారు. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్ ఉంటుందన్నారు. ఈ బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఊతం ఇస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో పనిచేయాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నట్లు చెప్పారు. కొత్త విధానాలపైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుందని మోదీ వివరించారు. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరిగేలా సభ్యులు సహకరించాలని, బిల్లులకు విపక్షాలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

## 4 రోజులుగా తల్లి మృతదేహంతో ఇంట్లోనే ఇద్దరు కుమార్తెలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వారాసిగూడలో దారుణం చోటుచేసుకుంది. అకస్మాత్తుగా తల్లి మరణం, ఆమె ఇద్దరు కుమార్తెలను మానసికంగా కుంగిపోయేలా చేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తల్లి మతదేహంతో ఒకే ఇంట్లో నాలుగు రోజులుగా కుమార్తెలుండిపోయారు. ఈ హృదయవిదారక ఘటన సికింద్రాబాద్ వారాసిగూడలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సికింద్రాబాద్ వారాసిగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని బౌద్ధనగర్‌లో లలిత అనే మహిళ మృతిచెందారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంట్లో పరిశీలించారు. లలిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. లలిత చనిపోయి నాలుగు రోజులవుతోందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె గుండె పోటుతో మరణించిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. తల్లి అకస్మాత్తుగా చనిపోవడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు రవళిక, యశ్విత మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఏం చేయాలో తెలియక నాలుగు రోజుల పాటు అదే ఇంట్లో ఒక గదిలో తల్లి మతదేహాన్ని ఉంచి, మరో గదిలో వారిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వారాసిగూడ పోలీసులు తెలిపారు.



## గద్దర్‌ను కించపరిస్తే ఊరుకునేది లేదు

- బీజేపీ కార్యాలయం ఉన్న కాలనీ పేరును గద్దర్ కాలనీగా మారుస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను కించపరిచేలా మాట్లాడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణను చిన్న చూపు చూసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ నుంచి గద్దర్, గోరేటి వెంకన్న, అందెశ్రీ, చుక్కారామయ్య, జయధీర్ తిరుమలరావు పేర్లను కేంద్రానికి పంపినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే కేంద్రం తెలంగాణ పట్ల వివక్షతో వ్యవహరించిందన్న రేవంత్ రెడ్డి.. పక్కరాష్ట్రానికి ఐదు అవార్డులు ఇచ్చి, తెలంగాణకు ఒక్కటి ఇచ్చారని, పద్మ అవార్డులు పొందిన పక్క రాష్ట్రం వారికంటే తెలంగాణకు చెందిన గద్దర్, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్, చుక్కారామయ్య ఏం తక్కువ అని ప్రశ్నించారు. కేంద్రం తప్పును సరిదిద్దుకుంటుందని లేఖరాస్తే.. గద్దర్‌కు అవార్డు ఇవ్వమని బీజేపీ నేతలు అంటున్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అవార్డులు ఇచ్చేది మేమే, గద్దర్‌కు అవార్డు ఇవ్వమని అంటున్నారన్నారు. అయితే వారి పార్టీ ఆఫీసు తెలంగాణలో ఉందనే విషయాన్ని మర్చిపోయారన్న ముఖ్యమంత్రి.. మరోసారి గద్దర్ గురించి తప్పుగా మాట్లాడితే, వారి పార్టీ ఆఫీస్ ఉన్న ప్రాంతానికి గద్దర్ పేరు పెడతానని, అప్పుడేం చేస్తారని ప్రశ్నించారు.

"నేను ఒక మాట చెప్పదలుచుకున్నాను. మరొక్కసారి మీరు, మీ పార్టీ గద్దరన్నకు వ్యతిరేకంగా, గద్దరన్న గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే మీ పార్టీ కార్యాలయం ఉన్న ప్రాంతానికి గద్దరన్న పేరును పెడతాను. మీ పార్టీ కార్యాలయం అడ్రస్ రాసుకోవాలంటే గద్దరన్న గల్లీ అని రాసుకునేలా చేస్తాను బిడ్డా" అని అన్నారు.

మిగితా 2వ పేజీలో

## పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే..



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభమ య్యాయి. కేంద్రంలో ఎన్డీయే సర్కార్ మూడోసారి సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. శనివారం ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2025-26) బడ్జెట్‌ను సమర్పించనుంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో బడ్జెట్ సమర్పించడానికి ముందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ప్రవేశపెట్టిన 2025 ఆర్థిక సర్వే 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు

మిగితా 2వ పేజీలో




## ఉస్మానియా ఆస్పత్రికి శంకుస్థాపన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ, పొన్నం ప్రభాకర్, సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డితో కలిసి గోషామహల్ స్టేడియం ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల కొత్త భవనాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని రూ.2,700 కోట్లతో 2027 నాటికి పూర్తి చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గోషామహల్‌లో కొత్త ఉస్మానియా హాస్పిటల్

మిగితా 2వ పేజీలో



## ఫిరాయింపులపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు

- రీజనబుల్ టైం అంటే శాసనసభ గడువు తీరేవరకా
- తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు అసహనం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి ఎందుకింత ఆలస్యమంటూ తెలంగాణ స్పీకర్‌పై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. నిర్ణయం తీసుకోవడానికి ఇంకా ఎంత టైం తీసుకుంటారంటూ ప్రశ్నించింది. ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టు లో శుక్రవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేసిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నిర్ణయం తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. తగిన సమయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు న్యాయవాది. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు చెప్పారు.

# పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలి



- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు**

**బలగం టీవీ, హైదరాబాద్**

పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు.

పదేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయ న్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోసపూరిత 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదన్నారు. టకీ టకీ మని పైసలు పడుతాయన్నారని.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదంటూ అబద్ధాలు చెబుతుందన్నారు. ఈ విషయం అప్పటి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందన్నారు. డూప్లికేట్ గాంధీలకు తెలంగాణ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బుద్ధి ఇవ్వాలని మహాత్ముడి విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

# దమ్ముంటే అసెంబ్లీకి రా..

(మొదటి పేజీ తరువాయి)



తన బాధ్యత అని హామీ ఇచ్చారు. ప్రజలకిచ్చిన హామీలపై వెనక్కి తగ్గేదే లేదని స్పష్టంచేశారు. రూ.7625 కోట్లను 72లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. కేసీఆర్ 2014లో రూ.లక్ష రుణమాఫీ చేస్తానని చెప్పి నాలుగు విడతలుగా మాఫీ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల రుణమాఫీ కొంద 25.50 లక్షల మందికి రూ.21వేల కోట్లు జమ చేశామని తెలిపారు. కేసీఆర్ మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని కాస్తా రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళాకోరుగా తయారు చేశారన్నారు. దాంతో రైతులకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాల్సి వస్తుందన్నారు. రైతు కూలీలకు సైతం ఆర్థిక భరోసా కింద ప్రతి కుటుంబానికీ రూ.12వేలు ఇస్తున్నామన్నారు. దేశ చరిత్రలో కుల గణన చేపట్టిన చరిత్ర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. బీసీ లెక్కలను తేల్చడంలో ప్రభుత్వం విజయం సాధించిందని అన్నారు. మాదిగల వర్గీకరణ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వర్గీకరణ చేసి తీరుతామని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే ఉందన్నారు. మొగిలిగిద్ద అభివృద్ధికి రూ.16 కోట్ల నిధులు కేటాయించినట్టు వెల్లడించారు. నోటిఫికేషన్లు వచ్చిన 55 రోజుల్లోనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని చెప్పారు.

# ఉస్మానియా ఆస్పత్రికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడారు. కొత్త ఆస్పత్రి రాకతో స్థానిక గోషామహల్ ప్రజలకు కూడా ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేశారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆస్పత్రి నిర్మాణం ఉంటుందన్నారు. స్కైవాక్ కూడా అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక వ్యాపారులకు కూడా మేలు కలుగుతుందని చెప్పారు. ప్రజాభిప్రాయానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రిని పలు చోట్ల ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, ఆ ఆస్పత్రికి ఉన్న ఘనమైన చరిత్రను దష్టిలో ఉంచుకుని గోషామహల్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. వందేండ్లుగా రోగులకు సేవలందిస్తున్న ఆస్పత్రిగా, ఉస్మానియా ఒక బ్రాండ్ అనీ, ఆ ఆస్పత్రి డాక్టర్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. పురాతన భవనంలో వైద్యం అందించలేని పరిస్థితిలో కొత్త ఉస్మానియా ఆస్పత్రి కోసం డాక్టర్లు, వైద్య సిబ్బంది, రోగులు, ప్రజలు కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం జరగాలని ఆకాంక్షించినట్టు తెలిపారు. అందరి ఆకాంక్షలను నిజం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డితో కలిసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామన్నారు. 1919 నుంచి స్థానిక ప్రజలకు ఉస్మానియా ఆస్పత్రితో అనుబంధం ఉందనీ, అందుకే ఇక్కడే ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

26.30 ఎకరాల్లో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం తర్వాత కూడా అక్కడ పోలీస్ శాఖకు 11 ఎకరాల స్థలం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో 1,168 బెడ్లు ఉండగా, కొత్త ఉస్మానియా ఆస్పత్రిలో 2 వేల బెడ్లు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఇందులో 500 బెడ్లు ఐసీయూ సౌకర్యంతో ఉంటాయన్నారు. ప్రస్తుత ఉస్మానియాలో 22 డిపార్ట్‌మెంట్లు ఉండగా, కొత్త ఆస్పత్రిలో అదనంగా మరో 8 డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. అన్ని రకాల వైద్యసేవలు అందించనుండటంతో రోగులను ఇంకో దగ్గరికి పంపించే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. దాదాపు 41 ఆపరేషన్ థియేటర్లు, ఆస్పత్రి ప్రాంగణంలోనే డెంటల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలు ఉంటాయన్నారు. విద్యార్థులకు, బోధనా సిబ్బందికి అధునాతన వసతులతో కూడిన హాస్టల్ సదుపాయం, 750 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, క్రీడా ప్రాంగణాలు, రోగుల సహాయకుల కోసం ధర్మశాల, ల్యాండ్‌స్కేప్ గార్డెన్ ఏర్పాటు, హాస్పిటల్‌కు నలువైపులా విశాలమైన రోడ్లు, సుమారు 3 వేల వాహనాలు ఒకేసారి పార్కింగ్ చేసుకునేలా అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సిస్టమ్, స్కైవాక్ నిర్మాణం సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్, పోలీస్ అవుట్ పోస్ట్ వంటివి కూడా హాస్పిటల్ ప్రాంగణంలో ఉంటాయని స్పష్టం చేశారు. గోషామహల్ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు.



# కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి ఖరారు చేస్తూ ఏఐసిసి శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కెసి వేణుగోపాల్ అదిలాబాద్, మెదక్, నిజాంబాద్, కరీంనగర్ ఎమ్మెల్సీ గా నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే బీజేపీ తమ అభ్యర్థిగా అంజిరెడ్డిని ప్రకటించిన విషయం విదితమే. బిఆర్ఎస్ తమ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

# జైలు నుంచి భుజంగరావు, రాధాకిషన్‌రావు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితులైన ఎస్‌బీఐ మాజీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీ భుజంగరావు శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఇద్దరికీ హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇద్దరు రూ.లక్ష చొప్పున ఇద్దరి పూచీకత్తులను సమర్పించగా ఇద్దరు నిందితులు ప్రతి సోమవారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట పోలీసుల ఎదుట హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. 8 వారాలపాటు పంజాగుట్ట పోలీసుల ఎదుట హాజరై విచారణాధికారికి సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే..

(మొదటి పేజీ తరువాయి)

6.3–6.8 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 8.2% వృద్ధిని నమోదు చేసిందన్నారు. దాంతో వరుసగా మూడో ఏటా 7% పైగా వృద్ధి నమోదు చేసినట్లయింది.ఆర్థిక సర్వే 2026 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటును 6.3–6.8% అంచనా వేసింది. ఇది అంతకుముందు సంవత్సరం వృద్ధి కంటే తక్కువగా ఉంది. అంతర్జాతీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ ఆర్థిక స్థిరత్వాన్ని నెలకొల్పడంలో విధానకర్తలు కీలక పాత్ర పోషించారని ఆర్థిక సర్వే తెలిపింది. సవాలుతో కూడిన అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వృద్ధిని కొనసాగించాలంటే గణనీయమైన ప్రయత్నాలు అవసరమని సర్వే నొక్కి చెప్పింది.

ఐటీ, ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫార్మా వంటి కీలక రంగాలు మంచి పనితీరు కనబరుస్తాయని పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సవాళ్లను ఎదుర్కొంటాయని అంచనా వేసింది. ఆయుష్మాన్ భారత్ పథకం, లక్‌పతి దీదీ పథకం, ఇండియా ఏఐ మిషన్ సహా ఆర్థిక వృద్ధిని పెంచడానికి ఉద్దేశించిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పురోగతి ఉంటుందని ఈ సర్వే తెలిపింది. ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం అనంతరం ఆమె ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించారు.

గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఆర్థిక సర్వే. ఏటా దీని ఆధారంగానే కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించే ఈ సర్వే రానున్న రోజుల్లో దేశం ముందున్న సవాళ్లు, వాటిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలను ముందుగానే అంచనా వేసి పలు సూచనలను చేస్తుంది.

# గద్దర్‌ను కించపరిస్తే ఊరుకునేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఇంతకుముందు, అధికారంలో ఉన్న వారు గద్దర్‌ను గేటు బయట నిలబెట్టారని, కానీ ఇప్పుడు ఆయన గద్దె కూలిపోయిందని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. ఇప్పుడు గద్దరన్న వారసుడు అధికారంలో ఉన్నాడని, గద్దరన్నను గేటు బయట నిలబెట్టిన వ్యక్తి బయట ఉన్నాడని వ్యాఖ్యానించారు. గద్దరన్నను గేటు బయట కూర్చోబెట్టిన వారికి ఏ గతి పట్టిందో గద్దరన్నను విమర్శించిన బీజేపీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. రాజకీయంగా ఒంటరిని అనే భావన వచ్చినప్పుడల్లా తాను గద్దర్ వద్దకు వెళ్లి సలహాలు తీసుకునేవాడినని రేవంత్ రెడ్డి అన్నారు. తుది శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం గద్దర్ జీవించారని కొనియాడారు. గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, జయధీర్ తరుమలరావు, అందెశ్రీకి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశామన్నారు.పక్కన ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చాయని, వాళ్లకంటే తాము ప్రతిపాదించిన వారు ఎందులో తక్కువ అని ప్రశ్నించారు. కేంద్రం చేసిన తప్పును సరిదిద్దుకుంటారని తాను లేఖ రాశానని, కానీ గద్దర్‌కు అవార్డు ఇచ్చేది లేదని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ‘నీటి విషయాల్లో రాజకీయాలు మాని నిజాలు చెప్పాలి’

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని సాగునీటి విషయాల్లో రాజకీయం మాని అసలు నిజాలు చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ‘నీళ్ల –నిజాలు’ పై శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయానికి మేడిగడ్డ బ్యారేజీమేరు నగధీరుడిలా గోదావరి వరదను కూడా తట్టుకొని నిలబడిందని అన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర కేడర్‌లో పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్‌ను బాధ్యతల నుంచి తొలగించి కృష్ణ ట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరపున బలంగా వాదనలు వినిపించాలని కవిత కోరారు. కేసీఆర్ నాయకత్వంలో అవిశ్రాంతంగా పని చేస్తేనే రాష్ట్రం కోటి ఎకరాల మాగాణంగా మారిందని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించాం. కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని పేర్కొన్నారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు..

- **ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

శాసన మండల సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని అదనపు కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ , నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి సభ్యుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, ఫిబ్రవరి 11న స్క్రూటినీ ని ఫిబ్రవరి 13 లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని, మార్చి 3న ఫలితాలు ఉంటాయని తెలిపారు.



ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని, 24 గంటలు , 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యల పై రిపోర్ట్ అందించాలని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అకౌంటింగ్ బృందాలు, ఎంసిసి బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీ.ఎస్.టి , వీ.వి.టి మొదలగు బృందాలను వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు . మండలాల్లో ఈ రోజు వరకు ఓటర్ నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని, పెండింగ్ ఉన్న పట్టభద్రులు, టీచర్స్ ఓటర్ నమోదు దరఖాస్తులను ఫిబ్రవరి 7 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు పరిశీలించాలని అన్నారు.

ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనలను ప్రకారం జారీ చేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని, బ్యాలెట్ డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలని, ఎన్ని జంబో బ్యాలెట్ నార్మల్ బ్యాలెట్ బాక్సులు ఉన్నాయో సరి చూసుకోవాలని అన్నారు.

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో పట్ట భద్రులకు సంబంధించి 28 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 21 వేల 614 మంది ఓటర్లు, ఉపాధ్యాయులకు సంబంధించి 13 మండలాల పరిధిలో 874 మాది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళికు సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఎన్నికల సిబ్బంది పాష రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి


- **నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మధ్యాహ్న భోజనాలు సిద్ధం చేసే గది, వండే విధానాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతి రోజు ఏ ఏ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారో ఆరా తీశారు. కూరగాయలు పప్పు, కోడిగుడ్లు సిద్ధం చేస్తుండగా, నాణ్యతను తనిఖీ చేశారు.ఈ రోజు ఎందరు విద్యార్థులు, టీచర్లు హాజరయ్యారో ఆరా తీయగా, మొత్తం 84 మంది విద్యార్థులు, అందరూ టీచర్లు వచ్చారని కలెక్టర్ దృష్టికి ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ తీసుకెళ్లారు.మరియు విద్యార్థులకు బోధన పాఠశాల లోని 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు గదులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా 10 వ తరగతి విద్యార్థుల కు మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ పాఠాలు బోధించారు. విద్యార్థులకు మ్యాథ్స్ ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టి విద్యార్థులను



ఉత్తేజ పరిచారు.పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.




## బీజేపీ మండల కమిటీల నియామకం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

భారతీయ జనతా పార్టీ తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో నూతన కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు, యువ మోర్చా బీజేవైఎమ్ అధ్యక్షునిగా కోసిని వినయ్ యాదవ్ ,ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కన్నా అరుణ్ కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా నాగుల శ్రీనివాస్ నియమకామయ్యారు.

## చెరుకు రైతులతో శాస్త్రవేత్తల చర్చా ఘోష్టి...

**బలగం టీవీ , బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో చెఱకు పంటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతుల మీద రైతులతో శాస్త్రవేత్తల చర్చా ఘోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డా.కె.మదన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ: ప్రస్తుత రైతులు పంట మార్పిడిలో భాగంగా చెఱకు పంటను సాగు చేసుకుంటే లాభమని వివరించారు.తదుపరి ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం నుండి విచ్చేసిన శాత్రవేత్తలు డా.రాకేష్ చెఱకులో ఉన్న మేలైన రకాలు మరియు వాటి గుణ గణాలను వివరిస్తూ, చెఱకు మొలక మరియు మోడెం తోటల్లో ఆచరించాల్సిన పద్ధతులు మరియు విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.తరువాత డా. కృష్ణ చైతన్య మాట్లాడుతూ:చెఱకు పంటలకు అనువైన నేలలు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. తదుపరి డా.సాయి చరణ్ మాట్లాడుతూ:చెఱకు పంటలలో వచ్చు పురుగులు తెగుళ్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డా.కె.మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త డా.ఏం. రాజేంద్ర ప్రసాద్ మరియు ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూరు శస్త్రవేత్తలు డా.కృష్ణ చైతన్య, డా.రాకేష్,డా.సాయి చరణ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ భేగం, సహాయ వ్యవసాయ సహ సంచాలకులు రామారావు, మండల వ్యవస్థాధికారి ప్రణీత, చెఱకు సాగు చేసే రైతులు మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.



## బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం..

- **పలువురు ప్రయాణికులకు గాయాలు.**
- **క్షేత్రగాతులను పరామర్శించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , గంభీరావుపేట**

ఆర్టీసీ బస్సు టైరు పగిలి, అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లో దిగబడడంతో , పలువురి ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని గోరంటాల గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. కామారెడ్డి డిపోకు చెందిన ఏపీ 29 జెడ్ 1742 కామారెడ్డి నుండి కరీంనగర్ కి 52 మంది ప్రయాణికులతో బయలుదేరింది. గంభీరావుపేట మండలం గోరింటాల గ్రామ శివారులోకి రాగానే బస్సు టైరు పగిలి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వెళ్ళింది. దీంతో పలువురి ప్రయాణికులకు గాయాలయ్యాయి.పంట పొలాల్లో ఉన్న రైతులు 108 కు సమాచారం అందివ్వగా, క్షేత్రగాతులను కామారెడ్డి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి, సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై శ్రీకాంత్,కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర సంఘటన స్థలాన్ని పరిశీలించారు.




**క్షత్రగాతులను పరామర్శించిన కలెక్టర్**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ప్రమాద విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆసుపత్రికి చేరుకుని, క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## మల్లారెడ్డిపేట వాసికి ఇంగ్లీష్ లో డాక్టరేట్..

**బలగం టీవీ, గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం మల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన పత్తెం సత్యనారాయణ “ఇంగ్లీష్ యాజ్ ఎ గ్లోబల్ లింగ్వా ఫ్రాంకా: లాంగ్వేజ్ టీచింగ్ అండ్ ఇంటర్‌కల్చరల్ కమ్యునికేషన్ కోసం చిక్కులను అన్వేషించడం” అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను రాజస్థాన్ కు చెందిన సన్ రైజ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది.పత్తెం సత్యనారాయణ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రాజ్ గోపాల్ సింగ్ చౌహన్ పర్యవేక్షణలో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. .పత్తెం సత్యనారాయణ కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఇంగ్లీష్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈసందర్భంగా పత్తెం సత్యనారాయణ ను బంగారు పేట గ్రామస్తులు అభినందించారు.

## సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా సాల్వాడి సమ్మయ్య

**బలగం టీవీ , సిరిసిల్ల**



సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ గా సాల్వాడి సమ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన దుబ్బాక లావణ్య హైదరాబాద్ జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు . ప్రస్తుతం హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సమ్మయ్య సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా నియమితులై బాధ్యతలు స్వీకరించారు.



# సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు..

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు బీసీసీఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు శనివారం బీసీసీఐ వార్షిక కార్యక్రమంలో సచిన్‌ను అవార్డుతో సత్కరించనున్నది. సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు సచిన్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. భారత క్రికెట్‌కు దిగ్గజ ఆటగాడు అందించిన సేవలు అమోఘమని పేర్కొన్నాయి. ఈ పురస్కారాన్ని స్వీకరించనున్న 31వ ఆటగాడు సచిన్ టెండూల్కర్ కావడం విశేషం. గతంలో మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి, లెజెండరీ వికెట్ కీపర్ ఫరూక్ ఇంజినీర్ సహా పలువురు ఈ అవార్డును అందుకున్నారు. 1994లో భారత జట్టు తొలి కెప్టెన్ కర్నల్ సీకే నాయుడు గౌరవార్థం ఈ అవార్డును బీసీసీఐ తీసుకువచ్చింది. సీకే నాయుడు 1916 నుంచి 1963 వరకు సుదీర్ఘంగా 47 సంవత్సరాల పాటు ఫస్ట్‌క్లాస్‌లో కొనసాగారు. ఇది ప్రపంచ రికార్డు కావడం విశేషం.

# నిరాశపర్చిన కోహ్లీ



**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవాళీలో పునరాగమనం చేసిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తీవ్ర నిరాశపరిచాడు. రంజీ మ్యాచ్‌లో రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. యశ్ ధూల్ ఔట్ కావడంతో సెకండ్ డౌన్‌లో క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లీ కేవలం 6 పరుగులు చేసి పెవిలియన్‌కు వెనుతిరిగాడు. లైన్ అండ్ లెంగ్త్ బాల్ ను ఆడటంలో విఫలమై వికెట్‌ను సమర్పించుకున్నాడు. రైల్వేస్ జట్టు బౌలర్ సంగ్వాన్ బౌలింగ్‌లో ఆఫ్ స్టంప్ ఎగిరి పడింది. ఫలితంగా కోహ్లీ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో విరాట్ అభిమానులకు కోహ్లీ బ్యాటింగ్ చూసే సంబరం కాసేపే దక్కినట్టైంది.

ఇక విరాట్‌ను చూసేందుకు వచ్చిన ప్రేక్షకులతో హోరెత్తిన స్టేడియం.. ఒక్కసారిగా మూగబోయింది. అప్పటివరకు కోహ్లీ బ్యాంటింగ్‌కు దిగుతుంటే అభిమానులు నినాదాలతో ఊగిపోయిన మైదానం.. అతడి ఔట్‌తో నిరుత్సాహపడిపోయింది. ఇక చేసేదేమిలేక అరుణ్ జైట్లీ స్టేడియానికి వచ్చిన అభిమానులు కూడా తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఇక ఢిల్లీ జట్టు రెండో రోజు ఆట ముగిసే సరికి 7 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. అంతకుముందు రైల్వేస్ జట్టు 241 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

## పద్మభూషణ్ ఎప్పుడో రావాల్సిందని అంటున్నారు: బాలకృష్ణ

**బలగం టీవీ, హైదరాబాద్**



సినీ రంగానికి చేసిన సేవలకు గాను బాలకృష్ణకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో బాలయ్యకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నానని, మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని... ఈ సమయంలో ఇలాంటి పురస్కారానికి ఎంపిక కావడం ప్రత్యేకంగా ఉందని చెప్పారు. పురస్కారాలు, బిరుదుల కోసం కాకుండా... నిబద్ధతతో మన బాధ్యతలను మనం నిర్వర్తించాలని అన్నారు. మనకు ఎంతో ఇచ్చిన సమాజానికి మనం ఏదైనా తిరిగి ఇవ్వాలని చెప్పారు. పద్మభూషణ్ ఎప్పుడో రావాలని ఎంతోమంది అంటున్నారని... ఆలస్యం ఏమీ కాలేదని బాలయ్య అన్నారు. నాన్న వందో జయంతి ఇటీవలే పూర్తయిందని, ఆయన నటించిన 'మన దేశం' విడుదలై 75 ఏళ్లు అయిందని, తన చిత్రాలు వరుసగా హిట్స్ అందుకోవడం... ఇవన్నీ వచ్చిన సందర్భంగా పద్మభూషణ్ రావడం సంతోషంగా ఉందని చెప్పారు. తాను ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతనతో ఉంటానని, పూజలు ఎక్కువగా చేస్తుంటానని తెలిపారు. బసవతారకం ఆసుపత్రి ద్వారా ఎంతోమందికి సేవ చేస్తుండటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

# సిరీస్ పట్టేశారు...





**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20 సిరీస్‌లో భాగంగా పుణె వేదికగా శుక్రవారం జరిగిన నాలుగో టీ20లో సమష్టిగా రాణించిన టీమిండియా 15 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఈ గెలుపుతో 3–1తో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది

నిర్ణీత 20 ఓవర్లలో 182 పరుగులు చేయాల్సిన ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌట్ అయింది. ఓపెనర్లలో బెన్ డకెట్ 39 పరుగులు, ఫిల్ సాల్ట్ 23 పరుగులు చేశారు. హరిబ్రూక్ 26 బంతుల్లో 51 పరుగులు చేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు హ్యారీ బ్రూక్ విధ్వంసకర బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని జోరుకు వరుణ్ చక్రవర్తి బ్రేక్ వేసాడు. స్టన్నింగ్ డెలివరీతో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. హ్యారీ బ్రూక్ వికెట్ అనంతరం ఇంగ్లండ్ వరుసగా వికెట్లు కోల్పోయింది. బ్రైడన్ కార్స్‌ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేయగా.. ఓవర్టన్‌ను హర్షిత్ రాణా క్లీన్ బౌల్డ్ చేశాడు. జోఫ్రా ఆర్చర్(0)ను రవి బిష్ణోయ్ ఔట్ చేయగా.. నిలకడగా ఆడిన జామీ ఓవర్టన్‌ను రాణా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆఖరి ఓవర్‌లో సకిబ్ మహమూద్‌ను అర్షదీప్ సింగ్ ఔట్ చేయడంతో భారత విజయం లాంఛనమైంది. భారత్ బౌలర్లలో రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా చెరో మూడు, వరుణ్ చక్రవర్తి రెండు, అర్షదీప్ సింగ్, అక్సర్ పటేల్ చెరో వికెట్ తీశారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా( 30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 53), శివమ్ దూబే(34 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించారు. రింకూ సింగ్(26 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 30), అభిషేక్ శర్మ(19 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 29)పర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సకీబ్ మహమూద్(3/35) మూడు వికెట్లు తీయగా.. జేమీ ఓవర్టన్(2/32) రెండు వికెట్లు పడగొట్టారు. బ్రైడన్ కార్స్, ఆదిల్ రషీద్ తలో వికెట్ తీసారు. 15 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌పై భారత్ ఘన విజయం సాధించింది. దీంతో ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్ భారత్ కైవసం అయ్యింది.

# అండర్ 19 ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్

## సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై ఘన విజయం



**బలగం టీవీ, కౌలాలంపూర్**

కౌలాలంపూర్ వేదికగా జరిగిన అండర్–19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను తొమ్మిది వికెట్ల తేడాతో టీమిండియా ఓడించింది. ఫలితంగా వరుసగా రెండోసారి భారత్ ఈ ఐసీసీ టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టింది.

కౌలలంపూర్‌లోని బేయూమస్ ఓవల్ స్టేడియంలో భారత్–ఇంగ్లండ్ మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్‌మహిళల జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ఓపెనర్ డెవీనా పెరిన్ 45 పరుగులతో సత్తా చాటగా.. మరో ఓపెనింగ్ బ్యాటర్ జెమీమా స్పెన్స్ మాత్రం తొమ్మిది పరుగులకే పరిమితమైంది. ఇక కెప్టెన్ అబీ నార్‌గ్రోవ్ 30 పరుగులతో రాణించగా.. లోయర్ ఆర్డర్‌లో అమూ సురేన్‌కుమార్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. మిగతా వాళ్లలో ట్రూడీ జాన్సన్ డకౌట్ కాగా.. చార్లెట్ స్టబ్స్ (4), కేటీ జోన్స్ (0), ప్రిషా తానావాలా(2), చార్లెట్ లాంబర్ట్(0) కూడా పూర్తిగా విఫల మయ్యారు. భారత బౌలర్లలో పరుణిక సిసోడియా, వైష్ణవి శర్మ మూడేసి వికెట్లతో చెలరేగగా.. ఆయుశీ శుక్లా రెండు వికెట్లు పడగొట్టింది.

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టపోయి 15 ఓవర్లలోనే 117 పరుగులు చేసి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. కమలిని–త్రిష జోడీ టీమిండియాకు మంచి శుభారంభం అందించింది. ఇద్దరు తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలల్పారు. ఫోబ్ బ్రెట్ బౌలింగ్ త్రిష అవుట్ అయ్యింది. 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. త్రిష తొలి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌వుమెన్‌గా నిలిచింది. ఆ తర్వాత కమలిని, సానిక చల్కే జోడీ టీమిండియా విజయాన్ని ఖరారు చేశారు. కమలిని 50 బంతుల్లో 56 పరుగులతో రాణించింది. సానికా 12 బంతుల్లో ఒక ఫోర్ సహాయంతో 11 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

ఇక మొదటి సెమీఫైనల్‌లో ఆసీస్‌ను సౌతాఫ్రికా చిత్తు చేసి తొలి ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. ఆదివారం భారత్–సౌతాఫ్రికా మధ్య ఫైనల్ జరుగుతుంది.

## ప్రముఖ నిర్మాత వేదరాజు టింబర్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ నిర్మాత వేదరాజు టింబర్ కన్నుమూత (54) కన్నుమూశారు. ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వేదరాజు టింబర్ కొన్ని నెలలుగా హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంలో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. వేదరాజు టింబర్ అల్లరి నరేశ్‌తో మడత కాజా, సంఘర్షణ సినిమాలను తెరకెక్కించారు.




**ప్రభాస్ ఇంటి విందుకు ఫిదా అయిపోయిన వారి జాబితాలో ఫౌజీ హీరోయిన్ కూడా చేరిపోయింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో కొనసాగుతోంది. సెట్స్‌లో బ్రేక్ టైంలో ప్రభాస్ కిచెన్‌లో వండిన హోం ఫుడ్‌ను ఆరగించింది ఇమాన్వీ. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో గ్లింప్స్ షేర్ చేసింది.రుచికరమైన యమ్మీ యమ్మీ భోజనం రుచి చూపించిన ప్రభాస్‌కు ధన్యవాదాలు అంటూ క్యాప్షన్ ఇచ్చింది.** బలగం టీవీ, హైదరాబాద్